


నాయుడుపేటలో ఓటు వేయిస్తున్న అధికారులు(ఇన్‌సెట్) కోనాయిగూడెంలో ఓటు వేయించేందుకు వస్తున్న అధికారులు

ఓటు.. గెలిచేట్టు!

ఇంటి నుంచే ఓటింగ్..

- నూతన విధానంతో దివ్యాంగులు, వృద్ధులకు తీరిన కష్టాలు
- మండలంలో 200 మంది దరఖాస్తు
- బుధవారంలో ఇద్దరు మినహా ఓటు హక్కు వినియోగం
- వంద శాతం పోలింగే లక్ష్యంగా అధికారుల కసరత్తు

నేలకొండపల్లి: దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటేయడానికి నానా పాట్లు పడుతుంటారు. అలాంటి వారి వెతలు తీర్చేందేకు కొత్తగా ఇంటి నుంచే ఓటేసేలా ఎన్నికల యంత్రాంగం పోస్టల్ బ్యాలెట్ అనే నూతన విధానాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని తొలిసారిగా చేపడుతుండగా.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ లక్ష్యంగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా వివిధ చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. గతంలో 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేసేందుకు సహాయకుల సాయంతో వెళ్లాల్సి వచ్చేది. ఈ విధానానికి స్వస్తి పలికిన ఎన్నికల సంఘం పోస్టల్ బ్యాలెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి ఓటింగ్ విధానాన్ని సులభతరం చేసింది.

స్ఫూర్తిగా తీసుకుని..

దుబ్బాక ఉప ఎన్నికలలో ఇంటి నుంచి ఓటు కార్యక్రమం విజయవంతం కావడంతో ఈ సాధారణ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు శ్రీకారం చుట్టారు. అందుకు ముందు నుంచే 80 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఫాం–12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రచారాలు కూడా చేయించారు. దీంతో పాలేరు డివిజన్‌లో 200 మంది దరఖాస్తు చేసుకోగా అందులో 83 మంది వృద్ధులు, 117 మంది దివ్యాంగులు ఉన్నారు. ప్రస్తుతానికి ఇంటి నుంచే ఓటింగ్ నడుస్తుండగా.. వీరిలో ఇద్దరు మినహా అంతా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ విధానం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న వృద్ధులు, దివ్యాంగులు వారి అభిప్రాయాలను ఇలా తెలిపారు.

ఇబ్బంది లేదు..



ఎన్నో ఎన్నికలకు వరుసలో నిలబడి ఓటు వేశాను. అందుకు నానా ఇబ్బంది పడ్డాను. కానీ మొదటిసారిగా తన ఇంటి వద్దకు వచ్చి ఓటు వేయించుకున్నారు. ఓటు వేసే సమయాన పడే ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేశారు. దీని వలన ఓటింగ్ శాతం పెరుగుతుంది.
– జిల్లిపోతుల అనసూయ, వృద్ధురాలు, నేలకొండపల్లి

ఆనందంగా ఉంది...



ఎన్నికల సంఘం మాలాంటి వారిని గుర్తించి, బ్యాలెట్‌ను ఇంటికి పంపించి ఓటు వేయించుకున్నారు. అందరి కంటే ముందే ఓటేశానని చాలా సంతోషంగా ఉంది. ఈ సారి ఓటు వేసేందుకు అనేక మార్పులు తీసుకొచ్చిన ఎన్నికల సంఘానికి రుణపడి ఉంటాం.
– బడేమియా, సీనియర్ సిటిజన్, చెరువుమాధారం

పోలింగ్ కేంద్రంలో ఓటేసినట్టుంది..



గతంలో పోలింగ్ కేంద్రంలో ఓటేసినట్లుగానే ఇప్పుడు కూడా ఉంది. ఇంట్లో నుంచి కదలకుండా ఓటేసేలా అవకాశం కల్పించడం మంచి ఆలోచన. మా ఇంట్లోనే పోలింగ్ కేంద్రం ఉన్నట్టుగా ఉంది. మా కష్టాలను గుర్తించిన అధికారులకు ధన్యవాదాలు.
– పిట్టల కృష్ణ, దివ్యాంగురాలు, నేలకొండపల్లి

మోసం చేసేవాళ్లను ప్రజలు నమ్మరు..



ఖమ్మంమయూరిసెంటర్: మాట్లాడుతున్న పువ్వాడ అజయ్‌కుమార్



5వ డివిజన్‌లో ఈవీఎంలో కారు గుర్తును చూపిస్తూ పువ్వాడ జయశ్రీ ప్రచారం

ఎన్నికల ప్రచారంలో ఖమ్మం బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: సీఎం కేసీఆర్ హయంలో ఖమ్మం అభివృద్ధికి రూ.3 వేల కోట్లు నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేశానని, కేటీఆర్ సీఎం అయితే రూ.30 వేల కోట్లు తీసుకొచ్చి ఉత్తమ సిటీగా చేస్తానని బీఆర్‌ఎస్ ఖమ్మం అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని పలు డివిజన్ల రోడ్‌షోలో, రఘునాథపాలెంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంకు మహార్దశ పడుతుందని, ఇంత అభివృద్ధి చెందుతుందని ఎవరైనా ఊహించారా? అని అన్నారు. ఖమ్మంను మహానగరాలకు దీటుగా అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. వన్‌టౌన్ ప్రాంతం తన గుండెకాయ లాంటిదని, అభివృద్ధిలో ఈ ప్రాంతానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు గతంలో తనపై పోటీ చేసి ఓడిపోతే కేసీఆర్ సార్ పిలిచి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిని చేస్తే నేడు ఆయననే మోసం చేశాడని అన్నారు. మోసం చేసే వారిని ప్రజలు నమ్మరని, వారి పట్ల ఖమ్మం ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్, తాగునీటి కష్టాలు, వ్యవసాయంను నట్టేట ముంచితే.. కేసీఆర్ వచ్చాక ఆ కష్టాలు తీరి వ్యవసాయ పండుగగా మార్చారని తెలిపారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని పువ్వాడ కోరారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, మార్కెట్ వైస్ చైర్మన్ ఆబ్జల్, మండల పార్టీ అధ్యక్షుడు వీరునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ విజయాన్ని కోరుతూ..

పువ్వాడ అజయ్‌కుమార్ విజయాన్ని కోరుతూ.. మమత విద్యా సంస్థల కార్యదర్శి, మంత్రి వదిన పువ్వాడ జయశ్రీ మంగళవారం నగరంలోని 5వ డివిజన్‌లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించగా.. బీఆర్‌ఎస్ నాయకులు కోలేటి రాధాక్రిష్ణ, తొట్టి కొమరయ్య, తార,తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 29, 46వ డివిజన్‌లలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ ఆధ్వర్యాన బీఆర్‌ఎస్ ఎన్నికల జిల్లా సమన్వయ కర్త గుండాల కృష్ణ ఇంటింటి ప్రచారం చేయగా.. బీఆర్‌ఎస్ నాయకులు అప్పారావు, మాతంగి అనిల్, అద్దంకి శివ, సైదులు, ధర్మారపు వెంకన్న, నారపోగు వెంకటేశ్, బడేసాహెబ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



కామేపల్లి : ఎమ్మెల్యే హరిప్రియ గెలుపును కాంక్షిస్తూ తాళ్లగూడెంలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

బీఆర్‌ఎస్ గెలుపు తథ్యం

కామేపల్లి: ఇల్లెందులో బీఆర్‌ఎస్ అభ్యర్థి హరిప్రియ గెలుపు ఖాయమని కామేపల్లి జెడ్పీటీసీ బానోత్ వెంకటప్రవీణ్‌కుమార్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు అన్నారు. మండలంలోని తాళ్లగూడెంలో బుధవారం ఇంటింటి ప్రచారం చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని, అదే కాంగ్రెస్‌కు ఓటేస్తే భవిష్యత్ ఆగమవుతుందని తెలిపారు. నాయకులు శెట్టి శ్రీనివాస్, పుచ్చకాయల బాబు, ముత్యం రాయకృష్ణ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రచారాలు.. సమావేశాలు..

తమ్మినేని గెలుపునకు ప్రచారం..

తిరుమలాయపాలెం: పాలేరు సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి తమ్మినేని వీరభద్రం గెలుపునకు ఆ పార్టీ జిల్లా నాయకుడు బండి రమేశ్ బుధవారం మండలంలో విస్తృత ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, నాయకులు అంగిరేకుల నర్సయ్య, వీరన్న, బింగి రమేశ్, దాసరి మహేందర్, నాగాటి సురేశ్, వేగినాటి వెంకట్రావు దొండేటి నిర్మల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సునామీ రాబోతుంది..

ఖమ్మంవన్‌టౌన్/రఘునాథపాలెం: తెలంగాణలో కాంగ్రెస్ సునామీ రాబోతుందని, ఆరు గ్యారంటీలతో ప్రజల జీవితాల్లో వెలుగులు రాబోతున్నాయని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని 22, 25, 41 డివిజన్లలో రోడ్ షోలు, కురవి మండల బలపాల గ్రామస్తుల, రజకుల, అఖిల భారత యాదవ మహాసభ, జిల్లా గొర్రెల పెంపకందారుల, జమాతే ఉలేమా ఈ హింద్ ఆత్మీయ సమ్మేళనాలు, రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారాల్లో ఆయన మాట్లాడారు. ఈ సమ్మేళనంలో ఏఐసీసీ అబ్జర్వర్, మహారాష్ట్ర మాజీ హోంమంత్రి ఆరీఫ్ నసీమ్‌ఖాన్, జిల్లా, రాష్ట్ర స్థాయి ధార్మిక పండితులు, పలు మసీదుల ఇమామ్‌లు, ఖతీబ్‌లు, విద్యావేత్త మహ్మద్ ఆసద్, డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఎంపీపీ గౌరి, బాలాజీ నాయక్, యండపల్లి సత్యం, చెరుకూరి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం..

కూసుమంచి: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ ఏపీ రాష్ట్ర కార్యదర్శి, పాలేరు అసెంబ్లీ ఇన్‌చార్జ్ రమేశ్ నాయుడు అన్నారు. పాలేరు అసెంబ్లీ అభ్యర్థి నున్నా రవికుమార్ విజయం కోరుతూ బుధవారం పాలేరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సమావేశం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో నున్నా రవికుమార్‌తోపాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి హత్యానాయక్, అధ్యక్షులు, నాయకులు చావా కిరణ్‌కుమార్, రవి రాథోడ్, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు వీరూగౌడ్, నున్నా వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఓటమే లక్ష్యంగా ప్రతీ నియోజకవర్గంలో విద్యార్థి లోకం..

ఖమ్మం మామిళ్లగూడెం: కేసీఆర్ ఓటమి కోసం నిరుద్యోగ విద్యార్థి లోకం ప్రతీ నియోజకవర్గంలో పనిచేస్తుందని ఓయూ జేఏసీ అధ్యక్షుడు తప్పెట్ల ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు అశోక్, రాజేశ్, మధు, శివమణి, గణేశ్, తరుణ్, అనిల్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే అన్ని వర్గాల అభివృద్ధి

కామేపల్లి: బీఎస్పీతోనే రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థి బాదావత్ ప్రతాప్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కామేపల్లి, పండితాపురంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంతారావు, శ్రీనివాసరావు, వెంకన్ననాయక్, రాయల శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీకాంత్, పాల్గొన్నారు.

దోపిడీని ప్రశ్నిస్తే.. డబ్బు సంచులు పంపారు..



ఖమ్మంరూరల్: వరంగల్ క్రాస్ రోడ్‌లో మాట్లాడుతున్న పొంగులేటి



తిరుమలాయపాలెం: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కే.వీ. కృష్ణారావు,తదితరులు

ఎన్నికల ప్రచారంలో పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: అబద్దాలు, మోసాలు, అవినీతితో రాజ్యమేలిన దొరను ఇక నుంచి గడిలోనే శాశ్వతంగా బంధించి, రాజకీయ సమాధి చేయాలని పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం నేలకొండపల్లి, ఖమ్మంరూరల్ మండలాల్లో ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ దోపిడీని ప్రశ్నిస్తే.. రేవంత్‌రెడ్డితో పాటు తనను కూడా ఓడించాలని డబ్బు సంచులు పంపిస్తున్నాడని అన్నారు. కేసీఆర్ దోచుకున్న సొమ్మును పంచుతున్నాడని, డబ్బును తీసుకుని కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సీపీఐ సీనియర్ నాయకుడు చాడ వెంకటరెడ్డి, టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, మద్ది శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ వజ్జా రమ్య, కాంగ్రెస్ నాయకులు స్వర్ణకుమారి, నెల్లూరి భద్రయ్య, రమేశ్, నాగరాజు, అంజిని, స్వర్ణ, లక్ష్మీనర్సయ్య, వీరబాబు, నరేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

నేలకొండపల్లి/కూసుమంచి/ఖమ్మంరూరల్: నేలకొండపల్లి మండలం కోనాయిగూడెం ఉప సర్పంచ్ వల్లమూడి నర్సయ్య, సీపీఎం మండల నాయకుడు బండి రాంమూర్తి, అనాసాగారాం మాజీ సర్పంచ్ వీరబాబు, ఆత్మా కమిటి మాజీ చైర్మన్ వీరభద్రయ్య పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కూసుమంచి మండలం తురకగూడెం గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ కన్నెబోయిన రాజశేఖర్, దాసరి రవి, కన్నెబోయిన లింగరాజు, ఖమ్మంరూరల్ మండలం పెదతండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రెడ్యా నాయక్‌తో పాటు మోహన్‌లు కాంగ్రెస్‌లో చేరారు.

పొంగులేటికి మద్దతు..

ఖమ్మంరూరల్: పొంగులేటి శ్రీనివాసరెడ్డికే తమ మద్దతు ఉంటుందని మండలంలోని పెదతండాలో గల మారుతీ షోరూం సంస్థ ఉద్యోగులు, కార్మికులు బుధవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి సమక్షంలో మద్దతును ప్రకటించారు.

పోస్టర్ల ఆవిష్కరణ..

తిరుమలాయపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం: పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం తిరుమలాయపాలెం, ఖమ్మంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ. కృష్ణారావు ఆధ్వర్యాన పోస్టర్లను ఆవిష్కరించారు. కాగా, ఖమ్మంలో నిర్వహించిన సమావేశంలో సత్తుపల్లి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ మట్టా రాగమయిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చి డాక్టర్ మట్టా దయానంద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం..



కామేపల్లి: కళాకారులతో కలిసి డప్పు వాయిస్తున్న కోరం కనకయ్య

ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య

కామేపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య వెల్లడించారు. మండలంలోని పలు గ్రామాల్లో టీపీసీసీ సభ్యుడు రాంరెడ్డి గోపాల్‌రెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. రాబోయే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాగా, కెప్టెన్‌బంజరలో నాయకులు ఆదివాసీ, గిరిజన సంప్రదాయ నృత్యాలతో కనకయ్యకు ఘన స్వాగతం పలికారు. అలాగే, మద్దులపల్లిలో ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్ ఆధ్వర్యాన పలువురు బీఆర్‌ఎస్‌ను వీడి కనకయ్య సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమాల్లో పలు పార్టీల నాయకులు బానోత్ సుజాత, సారయ్య, తోటకూరి శివయ్య, మేకల మల్లిబాబుయాదవ్, ఆరెం రవి, గట్టికొప్పుల నారాయణరెడ్డి, రెడబోతు గోపీరెడ్డి, ఇమ్మడి రామనాథం, సుంకిరెడ్డి దామోదర్‌రెడ్డి, అజ్మీరా అర్జున్, ధరావత్ బాలునాయక్, శ్రీరాములు, ఏపూరి మహేందర్, మద్దినేని రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ముస్లింల మద్దతు



అభివాదం చేస్తున్న ముస్లిం మత పెద్దలు,తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ముస్లింలు అందరూ కాంగ్రెస్ పార్టీ, మిత్రపక్ష సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని జమాఅెతే ఉలేమా ఏ హింద్ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అబ్దుల్ సత్తార్ పిలుపునిచ్చారు. బుధవారం సీక్వెల్ రిసార్ట్స్‌లో మౌలానా సయిద్ మహ్మద్ ఖాస్మి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్‌ఎస్‌ఎస్ నిర్దేశకత్వంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బీజేపీకి సహకారం అందిస్తూ.. దాని సూచనల మేరకు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించుకునేందుకు బాగా ఆలోచించి అనేక సమావేశాల అనంతరం తమ సంస్థ కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతును ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. దేశ సమైక్యత కోసం ముస్లింలంతా ఏకతాటిపైకి రావాలని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని తీర్మానం చేశారు. ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావును మత పెద్దలు ఆశీర్వదించి ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, ముస్తఫా, ఆసద్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు రఫీ, మహ్మద్ అశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలు విజయవంతం

ఖమ్మం రాపర్తినగర్: స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్.ఐ.ఓ.) ఖమ్మం శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన పట్టణ స్థాయి క్విజ్ పోటీలు విజయవంతమయ్యాయని ఎస్.ఐ.ఓ ఖమ్మం అధ్యక్షుడు అమీర్ ఒసామా పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం ఎస్.ఐ.ఓ కార్యాలయంలో ఈ క్విజ్ పోటీలు నిర్వహించగా.. ముఖ్య అతిథులుగా జమాతే ఇస్లామి హింద్ ఖమ్మం అధ్యక్షుడు జైన్ ఉల్ పాషా, ఎస్.ఐ.ఓ తెలంగాణ కార్యదర్శి ముసబ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. అనంతరం క్విజ్‌లో ప్రథమ స్థానం పొందిన హార్వెస్ట్ విద్యార్థులకు రూ.3,000, ద్వితీయ స్థానం పొందిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులకు రూ.2,000, తృతీయ స్థానం పొందిన త్రివేణి విద్యార్థులకు రూ.1,000 నగదు బహుమతితో పాటు క్విజ్ పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెమెంటోలు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హంజా, హుజై ఫా, రహ్మాన్, హలీమ్, అఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మెడికల్ రిటైల్ –డిస్ట్రిబ్యూటర్ వర్కర్ అసోసియేషన్ సభ్యుడు షేక్ బాబా(28) అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం ఈమేరకు అతడి కుటుంబానికి ఖమ్మం మెడికల్ రిటైల్ అండ్ డిస్ట్రిబ్యూటర్ వర్కర్ అసోసియేషన్ తరఫున రూ.39 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలోఅసోసియేషన్ సభ్యులు పాషా, హరి, బోస్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా సేవ చేశా..



నేలకొండపల్లి: మాట్లాడుతున్న కందాళ ఉపేందర్‌రెడ్డి



తిరుమలాయపాలెం: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కందాళ

ఎన్నికల ప్రచారంలో పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: గత అయిదేళ్లుగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సేవ చేశానని, మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజల రుణం తీర్చుకుంటానని పాలేరు బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత అయిదేళ్లుగా రాజకీయాలకతీతంగా ఎవరు వచ్చినా సాయం చేశానని, పాలేరు ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమన్నారు. లోకల్, నాన్‌లోకల్ మధ్య జరిగే ఈ పోటీలో స్థానికుడిగా, మీ బిడ్డగా నిరంతరం అండగా నిలబడిన తననే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ భవిష్యత్‌ను నిర్ణయించే ఎన్నికలు కనుక ప్రజలు ఆలోచించి ఓటేయాలని తెలిపారు. మనకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎంతో మంది రాజకీయ నాయకులను చూశాం, కానీ మీ అందరి ఇంటి బిడ్డలా, పెద్ద అన్నలా అందరి కష్టసుఖాల్లో పాలుపంచుకొంటూ తోడుగా ఉన్న తనను మరోసారి దీవించి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి మాజీ జెడ్పీటీసీలు..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మాజీ జెడ్పీటీసీలు ఎలకొండ నాగేశ్వరరావు, సాంబమ్మ దంపతులు బుధవారం రాత్రి ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌కి ముఖ్య అనుచరుడిగా ఉన్న నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని కందాళ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బీఆర్‌ఎస్ నాయకుడు సంభాని చంద్రశేఖర్, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు తదితరులు పాల్గొన్నారు.

హరిహరసుతనే శరణం అయ్యప్ప..

కామేపల్లి/నేలకొండపల్లి: అయ్యప్ప మాలధారులు బుధవారం కావడంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శరణం అయ్యప్ప.. అంటూ భక్తి గీతాలు ఆలపించారు. కామేపల్లి మండలంలోని భాసిత్‌నగర్ గ్రామంలో పడిపూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భజనలు, పూజలు చేశారు. మాలధారులు నిప్పులపై నడిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ సునీత, సర్పంచ్ ధరావత్ బాలునాయక్ పాల్గొన్నారు. అలాగే, నేలకొండపల్లిలో గురుస్వామి చట్టు ధనమూర్తి నివాసంలోని అయ్యప్ప విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు గోరెంట్ల నర్సింహారావు, రాజా, పావులూరి వెంకటేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, మాదాసు శ్రీనివాసరావు, విజయ్, పసుపులేటి సైదులు తదితరులు పాల్గొన్నారు.



కామేపల్లి: పూజలు చేస్తున్న మాలధారులు